# చీకటి

చీకటి ! కటిక చీకటి ! కారు చీకటి - అలాంటి చీకటంటే చిన్నికి చాలా యిష్టం ! వెలుగంటే చిన్నికి అసలు ఇష్టం లేదు. వెలుగొస్తుందంటే భయం ! వెలుగొస్తే చాలు - లేరా, లేరా అంటూ అమ్మ లేపేస్తుంది. నిద్రొస్తూంటే పడుకోనీయదు. రెక్క పట్టుకు లాగి కూర్చొ పెడ్తుంది. పళ్ళు తోముకో, నీళ్ళోసుకో, చద్ది తిని బడికెళ్ళు - చదువుకో. -పగలంతా యిదే గొడవ. స్కూలు కెడితే చదువంటాడు మేష్టరు. అంకెలంటూ ప్రాణం తీస్తాడు. చేయకపోతే బెత్తంతో కొడ్తాడు. గోడ కుర్చీ వేయమంటాడు. పగలంతా చదువు - వెలుగున్నంత సేపూ ఆడుకోనీయరు,

ఇవన్నీ ఒక ఎత్తు - చిన్నికి యింట్లో తండ్రిని చూస్తే భయం. చిన్నికే కాదు వాళ్ళమ్మకీ చచ్చే భయం ! వాళ్ళ నాన్న ఎప్పుడొస్తాడో, ఎందుకొస్తాడో - వచ్చాడంటే వాళ్ళమ్మకి తండ్రి చేతిలో చావు దెబ్బలు తప్పవని, ఐదేళ్ళ చిన్నికి కూడా అర్థం అయిపోయింది. తండ్రి పగలే యింటికొస్తాడు - రాత్రిళ్ళు ఎక్కడికో పోతాడట. "ఏ ముండ దగ్గిరో పడుంటాడు" యిరుగు పొరుగు అనే ఆ మాటలు చిన్నికి అర్థం కాక పోయినా ఆ "ముండ" వల్లే తండ్రి రాత్రి యింటికి రాడని, ఆ ముండ వల్లే తల్లి చచ్చే దెబ్బలు తింటూందన్నది చిన్నికి తెల్సిపోయింది. "అమ్మా, ఆ ముండెవరే అమ్మా" అన్నాడు ఓ రోజు. తల్లి జవాబు చెప్పకుండా చిన్నిని దగ్గరికి లాక్కుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "అమ్మా ఆ ముండని చంపేస్తాను నేను. అలా అయితే నాన్న నిన్ను కొట్టడు." అన్నాడు - "నా బాబే నా తండ్రే - నీవేరా నాకు బతుకులో ఆశ -" అంది ఏడుస్తూ తల్లి. తండ్రి ఇంటికొచ్చాడంటే, పిల్లికూనలా ఏ తడిక చాటో నక్కుతాడు చిన్ని. తండ్రి వస్తూనే తల్లిని బండ బూతులు

తిన్తాడు - తంతాడు. వండిందంతా మెక్కి పోతాడు, చిన్నికి కూడా ఏమీ మిగలకుండా. తల్లి డబ్బడిగితే మరో రెండు తగిలిస్తాడు - అదంతా బితుకు బితుకుమని చూస్తాడు చిన్ని, అందుకే చిన్నికి వాళ్ళ నాన్నంటే కోపం భయం, అసహ్యం! అందుకే చిన్నికి పగలంటే భయం!

చక్కగా చీకటి పడితే అమ్మ వేడినీళ్ళు పోస్తే, వేడి బువ్వ తిని, అమ్మ పొట్ట కరుచుకుని వెచ్చగా పడుకోవచ్చు - రాత్రయితే నాన్న రాడు, అమ్మని కొట్టడు, అమ్మ ఏడవడం చూడక్కరలేదు. ఆకలి వెయ్యదు. బడి కెళ్ళక్కరలేదు, చక్కగా ఏ గొడవా లేకుండా వెచ్చగా పడుకోవచ్చు. అంచేత, చిన్నికి ఎప్పుడూ చీకటయితేనే బాగుండుననిపిస్తుంది.

అలాంటి చీకటి రాత్రే, నిద్రపోతున్న చిన్నిగాడ్ని తీసుకుని లారీ ఎక్కి వాళ్ళమ్మ ఎటో తీసుకెళ్ళడం వాడికి కొంచెం గుర్తుంది. ఆ పగలు వాడి నాన్న రోజూ కంటె ఎక్కువగా చావదన్నాడు వాళ్ళమ్మని. "చావు నంజా" ఆ రాఘవులు ఎందుకొస్తాడే, డు నీ రంకు మొగుడా, ఆడితోటే పోవే ముండా" అంటూ ఏవేవో తిట్టి, గోడకేసి తలబాది, కాలితో తన్ని, కుళ్ళబొడిచి కసితీరేదాకా చితకతన్నాడు. స్కూలునించి అప్పుడే వచ్చిన చిన్నిగాడు అదంతా చూసి తల్లి పడిపోయి, లేవకపోవడం చూసి బావురు మని ఏడ్చేశాడు. "నోర్మూయ్ గుంటెదవా" అంటూ వాడ్ని ఓటి తగిలించి తూలుకుంటూ వెళ్ళిపోయాడు వాళ్ళ నాన్న. చిన్నిగాడి ఏడ్పుకి, ఆ కేక లకి యిరుగు పొరుగు వచ్చారు. తెలివి తప్పిపోయిన వాడి అమ్మ మొహం మీద నీళ్ళు, చల్లి లేవదీసి కూర్చోపెట్టారు. "ఇంక నేనీ బాధలు పడలే నత్తా" అంటూ రాములమ్మని పట్టుకు ఏడ్చింది వాడమ్మ. "ఏం జన్మే మనది. ఊరుకోయే, ఆడబతుకింతేనే" అంటూ ఓదార్చారు అందరూ. "ఈపాటి తిండి రెండిళ్ళల్లో పాచిపని చేసుకున్నా దొరుకిద్ది, ఈడి చేతుల్లో దెబ్బలు తిని సావడమెందుకు, ఎటన్నా ఎల్లిపో" అన్నారందరూ ఓదారుస్తూ.

అంతా వెళ్ళాక రాఘవులు చిన్నాన్న వచ్చి చిన్నిగాడి అమ్మ

కథా నిలయం
785

వంటిని దెబ్బలు చూసి, వాడి నాన్నని చెడామడా తిట్టి, "పద నిన్నింక ఈ నరకంలో ఒక్క క్షణం వుండనీయను" అంటూ ఏవేవో చెప్పాడు. రాఘవులు చిన్నాన అంటే చిన్నికి ఎంతో యిష్టం. ఎప్పుడొచ్చినా మిఠాయిలు, పూలు, గాజులు ఏవో తెస్తాడు. చిన్నిగాడ్ని ఎత్తుకుంటాడు. బిళ్ళలు, బుంగలు ఏవో ఏవో యిస్తాడు. చిన్నిగాడి నాన్నంటే చిన్నానకి ఎంతో కోపం. ఎప్పుడొచ్చినా తాగుబోతు లంజాకొడుకు అంటూ తిడ్తాడు. అందుకే చిన్నాన్న అంటే చిన్నికి ఎంతో యిష్టం.

ఆ చీకటి రాత్రి చిన్నాన్న లారీ ఎక్కి, చిన్నాన్న దగ్గరికి వెళ్ళి పోయారు చిన్నిగాడు, వాళ్ళమ్మ.

ఆ రోజునించే చిన్నిగాడికి, వెలుగంటే భయంపోయి చీకటంటే భయం పట్టుకుంది! చీకటి పడితే చిన్నికి భయం. చీకటి పడితే చీకటి గదిలో ఒంటరిగా పడుకోవాలంటే చిన్నికి చచ్చే భయం. ఒంటరిగా తనని వేరే పడుకోబెట్టి అమ్మ, చిన్నాన తడికల గదిలో పడుకుంటారు. వారికే గుసగుస లాడుకుంటారు. కిసకిస నవ్వుకుంటారు. ఒంటరిగా పడుకోవాలంటే చిన్నికి చచ్చేభయంగా వుంది. "అమ్మా నీదగ్గిర పడుకుంటానే" అంటే, చిన్నాన కోపంగా చూసి "పోరా యింకా అమ్మని కౌగలించుకుని తొంగోడానికి సిన్నోడివేంటి—ఎల్లు భయమేటి" అని కసిరాడు. చిన్నిగాడికి, ఇక్కడికి వచ్చిం దగ్గరనించి చిన్నాన అంటే వళ్ళు మండిపోతూంది. ఇన్నాళ్ళూ చిన్నిగా చిన్నిగా అంటూ ముద్దు చేసేవాడు! అన్నీ కొనేవాడు. ఇక్కడి కొచ్చిం దగ్గరనించి తనని చూస్తేనే మొహం చిట్లిస్తాడు. ఎప్పుడూ ఎందుకో విసుక్కుంటాడు. కసురుతాడు. గాడిదా చదువుకో, వెధవా పో, అంటూ ఏదో తిడ్తూనే వుంటాడు. అమ్మెప్పుడన్నా ఏదన్నా అనబోతే "వాడ్ని అలా ముద్దుచేసి పాడుచేయకు, ఏడేళ్ళొచ్చాయి యింకా పసికూన అనుకుంటున్నావేటి" అంటాడు కోపంగా.— చిన్నాన్న ఇలా మారిపోతాడని తెలిస్తే, చచ్చినా వచ్చేవాడిని కాను, అనుకుంటాడు కోపంగా చిన్నిగాడు, ఈ చిన్నాన్న కంటే నాన్నే నయం.

అమ్మని కొట్టేవాడు, కాని నన్ను కొట్టలేదు. ఛీ—— చిన్నాన్న మంచివాడు కాడు. ఉక్రోషంగా అనుకుంటాడు చిన్నిగాడు. ఈ చిన్నాన్న అమ్మని కూడా పాడుచేసేడు. అమ్మకూడా చిన్నాన్నతో కల్సిపోతూంది. ఇదివరకు ఎంతో ముద్దుచేసేది తనని, కౌగలించుకొని ఏడిచేది, "నీవేరా నాకు మిగిలావు" అనేది. ఎంత బాగా చూసేది, ఎప్పుడూ తిట్టేదికాదు. ఇక్కడికొచ్చాక, అసలు తన గొడవే పట్టించుకోదు. ఎంతసేపు చిన్నాన్న వెనకాలే తిరుగుతుంది. చిన్నాన్నకి చంటిపిల్లాడికి పోసినట్టు నీళ్ళు పోస్తుంది. సిగ్గులేకుండా చిన్నాన్న, చిన్ని పిల్లాడిలా ముద్దలు తినిపించమంటాడు. తల దువ్వించుకుంటాడు. ఇద్దరూ వూరికే కిచకిచలాడతారు. అదోలా చూసుకుంటారు .... చిన్నిగాడికి అదంతా చూస్తుంటే ఏదో కసిగావుంది. చిన్నిగాడ్ని అలాంటప్పుడు "పోరా వెధవా, ఎప్పుడూ ఇంట్లో ఏడుస్తావేం. పోయి ఆడుకో" అని తిడ్తాడు చిన్నాన్న. "అబ్బబ్బ! ఏమిటిరా చిన్నిగా ఎప్పుడూ నా కొంగుపట్టుకు ఏడుస్తావేం, ఆడుకోపోయి," అని అమ్మ కసురుతుంది. చిన్నిగాడికి ఉక్రోషంతో ఏడుపు వస్తోంది, ఏదో చెయ్యాలని వుంటుంది, ఏం చెయ్యలేక, కోపంగా వీధిలోకి పోయి అరుగుమీద కూర్చుంటాడు.

పోనీ పగలయితే అనుకోవచ్చు. రాత్రి చీకట్లో ఒంటరిగా పడుకోవాలంటే ఎంతో భయం వేస్తుంది. అమ్మ పక్కలో పడుకోపోతే నిద్రే రాదు. చీకటి, చుట్టూ చీకటి——కటికచీకటి, ఆ చీకటి రాక్షసుడిలా భయపెడుతూంటే, చిన్ని ప్రాణం బిక్క చచ్చిపోతుంది. అరుస్తే, ఏడిస్తే చిన్నాన్న వింటాడని భయం —— కళ్ళు గట్టిగా మూసుకుంటే మరింత చీకటి——ఏడుపు వస్తుంది. కళ్ళంట కారే నీటిని తుడుచుకోకుండా అమ్మా, అమ్మా అని లోలోపల ఏడుస్తాడు చిన్నిగాడు. నిద్రపట్టదు. పక్కనించి వినవచ్చే నవ్వులు వింటూ, కసిగా, కోపంగా "ఈ చిన్నాన్న చచ్చిపోవాలి, ఈ చిన్నాన్నని చంపేయ్యాలి, ఈ చిన్నాన్న చచ్చిపోతే చక్కగా మళ్ళీ అమ్మా, తాను హాయిగా వుండవచ్చు, చక్కగా అమ్మని కౌగలించుకుని భయం లేకుండా పడుకోవచ్చు" అనుకుంటాడు.

చిన్నిగాడి ప్రార్థన విన్నట్టు దేముడు చిన్నిగాడి కోరిక త్వరలోనే

తీర్చాడు, లారీ ఏక్సిడెంటులో ర క్తం ముద్దయిన రాఘవుల్ని తీసుకొచ్చి పడేశారు. చిన్నిగాడి అమ్మ కెవ్వున కేకేసి పడిపోయింది. చిన్నాన్న నిజంగా చచ్చిపోయినందుకు చిన్నిగాడి మనసులో సంతోషం అన్పించినా వాడి అమ్మ ఏడుస్తూన్నందుకు వాడూ ఏడ్చాడు.

చిన్నాన్న చచ్చిపోతే తను, అమ్మ మళ్ళీ ఎంచక్కా హాయిగా వుండొచ్చు అనుకున్న చిన్నిగాడి ఆశ, రోజులు గడుస్తున్నకొద్ది అడియాస అయిపోయింది, చిన్నాన్న చచ్చిపోయిం దగ్గరనుంచి అమ్మని చూస్తే భయమేస్తుంది చిన్నికి. కొన్నాళ్ళు నాన్నంటే భయం. తర్వాత చిన్నాన్నంటే భయం, యిప్పుడు అమ్మంటే భయం! అమ్మ దగ్గిరకి వెళ్ళాలంటేనే భయం. అమ్మ అసలు మాట్లాడడం మానేసింది. ఎప్పుడూ ఏడుస్తుంది పడుకుని. లేదంటే ఎటో చూస్తూ ఆలోచిస్తుంది. చిన్నిని పలకరించదు, దగ్గిరకి తీసుకోదు, నీళ్ళు పోయదు, వంట చేయదు. అన్నం పెట్టదు. చిన్నిగాడిని కసురుతుంది. తిడ్తుంది. "నా ప్రాణానికి నీ వొకడవురా దౌర్భాగ్యుడివి. నీ మూలంగా చావాలన్నా చావలేకపోతున్నానురా—" అంటూ ఏడుస్తుంది. "దరిద్రగొట్టు వెధవా, నీది దరిద్ర జాతకంరా, లేకపోతే చిన్నాన్న ఎందుకు చచ్చిపోతాడు. మనం ఇలా దిక్కులేనివాళ్ళం ఎందుకవుతాం" అంటూ చిన్నిగాడ్ని కొట్టి తన బుర్ర బాదుకుంటుంది. తల్లి అలా అంటే తను కోరడం మూలంగానే చిన్నాన్న చచ్చిపోయాడని, అందుకే అమ్మ తిడుతూందని చిన్నిగాడికి ఏడుపు వచ్చేది. దిక్కులేని వాళ్ళం అయ్యాం అని తల్లి అంటే, ఆ మాటకి అర్థం అప్పుడు బోధపడలేదు గాని, తరువాత తరువాత అర్థం అయింది చిన్నిగాడికి.

• • •

ఆ తరువాత తరువాత చిన్నాన్న ఉన్నప్పుడే బాగుందేదనిపించింది చిన్నిగాడికి. తనని తిడ్తేనేంగాక, అమ్మ, చిన్నాన్న కసురుతేనేంగాక, రెండుపూటలా శుభ్రంగా యింత తినడానికి దొరికేది. నాన్న దగ్గరున్నప్పుడులా కాక, రోజూ కూర అన్నీ వుండేవి తినడానికి. టీకూడా తాగేవాడు.

చిన్నాన్న చచ్చిపోయాక, నెలరోజులు వాడి అమ్మెలాగో గడిపింది. తరువాత తరువాత ఒకపూటుంటే ఒకపూట ఏమీ వుండేదికాదు చిన్ని ఆకలి అని గోలపెడితే వాళ్ళమ్మ వాడ్ని కొట్టి, తరువాత ఏడిచేది, నెల్లాళ్లు వాళ్ళమ్మ వీళ్ళనీ వాళ్ళనీ డబ్బడిగి యింత గంజి కాచేది. తరువాత అదీ లేదు. చిన్నిగాడు ఆకలి అంటూ ఏడుపు. తరువాత వాడి అమ్మ కూలీ కెళ్ళడం ఆరంభించింది. ఒకరోజు కూలీ దొరకేది. మరో రోజు లేదు. ఎవరింట్లోనో పనికి కుదిరాక కాస్త నయం. రెండు పూటలా యింత గంజన్నా దొరికేది. బొద్దుగా వుండే చిన్నిగాడు పుల్లలా తయారయ్యాడు. ఆకలంటే అన్నం పెట్టని వాడమ్మమీద వాడికి కోపం పెరిగిపోతూంది. "ఎందు కన్నం పెట్టవు" అని ఎగిరేవాడు. "నాకీ గంజివద్దు అన్నంపెట్టు" అంటూ మొండికేసే చిన్నిగాడ్ని సముదాయించలేక, వాడి అమ్మవాడ్ని చావ బాదేది.

ఓరోజు సాయంత్రం చిన్నిగాడు బడినించి వచ్చేటప్పటికి వాడి అమ్మ వంటచేస్తూ ఏడుస్తూంది. వాడి అమ్మ చుట్టూ బియ్యం, పప్పు, కూరలు అన్నీ వున్నాయి. చిన్నిగాడి కోసం బిస్కట్లూ వున్నాయి. అవి చూడగానే చిన్నిగాడు సంతోషంగా వురికి గుప్పెడు బిస్కట్లు తీసుకున్నాడు. వాడి అమ్మ కళ్ళు ఏడ్చిఏడ్చి ఉబ్బి ఉన్నాయి. పొయ్యిసెగకో, ఏడుపుకో మొహం అంతా ఎర్రబడిపోయింది. గబగబా బిస్కట్లు తీసుకుంటున్న చిన్నిగాడిని ఎర్రటి కళ్ళతో తీక్షణంగా చూసింది - "తినరా వెధవా తిను. దరిద్రుడా, మింగరా. ఇవన్నికూడా మింగు - నన్ను కూడా మింగు - అప్పుడయినా నీ ఆకలి చల్లారుతుందేమో" అంటూ కోపంగా తిట్టి తరువాత ఏడవడం మొదలు పెట్టింది. "నీ కోసంరా.... నీ కోసంరా, ఇదంతా చేశాను." వెక్కిళ్ళ మధ్య తల్లి అంటున్న మాటలు చిన్నిగాడికి అర్థంకాక, తల్లి ఎందుకు తిడ్తుందో తన తప్పేమిటో తెలియక, బిస్కట్లు తినడం మానేసి భయంగా చూస్తుండిపోయాడు.

ఆ రోజునించి చిన్నిగాడు మరి ఆకలంటూ ఏడవకుండానే వాడి అమ్మ అన్నం పెట్టేది. చిన్నిగాడికి అన్నం మళ్ళీ దొరుకుతున్నందుకు సంతోషంగా వుందిగాని, అమ్మతో మాట్లాడాలండే భయంగా వుంది.

వాడి అమ్మ అసలు మాట్లాడడం మానేసింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ దిగులుగా కూర్చుంటుంది. కూలి పని, పాచిపని మానేసింది. అయినా రోజూ అన్నం ఎలా వస్తుందో చిన్నికి తెలియదు. అమ్మని అడగాలంటే దగ్గరకు వెడితేనే కసురుతుంది. "నన్ను విసిగించకు వెళ్ళు" అంటుంది. "నీకు కావల్సింది అన్నమేగా" అంటుంది. చిన్నిగాడు అప్పటినుంచి వాళ్ళమ్మని ఏమీ అడగడం మానేశాడు. పెట్టిందేదో శుభ్రంగా తినేవాడు. "డబ్బెక్కడనించి తెస్తే నాకెందుకు" అనుకున్నాడు

ఆ డబ్బు వాళ్ళమ్మకి ఎక్కడినించి వస్తూందో కొద్ది రోజులలో చిన్నిగాడికి తెల్సిపోయింది. ఓరోజు మంచి నిద్రలో ఎందుకో మెలకువ వచ్చేసింది చిన్నికి. పక్కన అమ్మలేదు. ఆ పక్క గదిలో చిన్నదీపం వెలుగుతూంది. రాత్రి అమ్మేం చేస్తూంది అనుకుని చిన్ని లేచి తడిక కన్నంలోంచి తొంగి చూశాడు. ఆ గుడ్డి వెలుగులో వాడి అమ్మ ఏం చేస్తూందో చూసేసరికి చిన్నిగాడికి మొదట సిగ్గేసింది. ఆ తరువాత అసహ్యం వేసింది. ఛీ అమ్మేంటిలాగ - సిగ్గు లేకుండా, అసలు వాడెవడు అనుకున్నాడు. ఆ తరువాత కోపం వచ్చేసింది. "అమ్మా" అని కోపంగా ఒక్క అరుపు అరిచాడు. వాళ్ళమ్మ తుళ్ళిపడి లేచి చటుక్కున చీర సవరించుకుని దీపంబుడ్డి ఊదేసి తడిక తీసుకుని వచ్చి చీకట్లో చిన్నిగాడ్ని పట్టుకుని "ఏరా లేచావేం" అంది ఏం తెలీనట్టు - చిన్నిగాడి కళ్ళు ఆ చీకట్లో మెరిశాయి. కోపంగా తల్లిచెయ్యి తోసేశాడు. "ఏంచేస్తున్నావు" అన్నాడు పెద్దవాడిలా, అధికారంగా, ఏడేళ్ళ చిన్నిగాడు. వాళ్ళమ్మ ఒక్క క్షణం తడబడి "ఏం చెయ్యడంలేదు. పద పడుకుందాం" అంటూ తీసికెళ్ళిపోయింది. "ఉహూ నే పడుకోను - ఆ గదిలో వాడెవడు. ఎందుకొచ్చాడు, నన్నొదిలేసి వాడి దగ్గర నీవెందుకు పడుకున్నావు?" అన్నాడు కోపంగా. వాళ్ళమ్మకి కోపంవచ్చి నెత్తిమీద ఒక్కటేసి "పద వెధవా, పెద్ద కబుర్లాడకుండా వెళ్ళి పడుకో -" అంటూ బలవంతాన లాక్కెళ్ళి నులకమంచంమీద కూలేసి "ఇక్కడనించి కదిలావంటే చూడు- పడుకో- నేనిప్పుడే వస్తాను, లేచావో రేపు నీ కన్నం పెట్టను." అంటూ బెదిరించి, మళ్ళీ ఆ గదిలోనికి వెళ్ళిపోయింది. ఆ గదిలో మళ్ళీ దీపం వెలగలేదు.

చిన్నిగాడికి ఏం కనపడలేదుగాని ఏవేవో గుసగుసలు వినిపించాయి. ఓ అరగంట పోయాక వాళ్ళమ్మ వచ్చి నెమ్మదిగా వాడి పక్కన పడుకుంది. ఆ చీకట్లో కళ్ళు విప్పుకుని కోపంగా పడుకున్న చిన్నిగాడికి, వాళ్ళమ్మని అంటుకోవాలంటే అసహ్యం వేసింది. వాళ్ళమ్మకి తగలకుండా అటు తిరిగి పడుకుండిపోయాడు కోపంగా.

ఆ తరువాత చాలా రాత్రులు, చిన్నిగాడు నిద్రపోకుండా వాళ్ళమ్మ చేసే పనులన్నీ ఆ చీకట్లో పడుకొని గమనిస్తూనే వుండేవాడు. నిద్రలో మెలకువ వచ్చినా, వాడి అమ్మ పక్కనే లేకపోయినా, లేచి వెళ్ళి చూసే వాడు కాదు. వాడికిప్పుడు వాళ్ళమ్మ సంగతి తెల్సిపోయింది. ఛీ అనుకునే వాడు కోపంగా – ఆ తడిక చాటునించి వినవచ్చే మాటలు వింటూంటే వాడి ఒళ్ళు ఉడికిపోయేది,

ఓ రోజు చిన్నిగాడికి ఏవో కేకలకి మెలకువ వచ్చింది. "దీపం వెలిగించు ఈ చీకట్లో సరసానికేటి పదియాపాయ లుచ్చుకున్నావు." పెద్దగా అంటున్నాడెవడో.

"దీపం వద్దండి, పక్కన కుర్రాడు పడుకొన్నాడు చూస్తే బాగోదు" చిన్నిగాడి తల్లి గొంతు. "గానం వచ్చినాడు, సూస్తై బాగోదు."

"సాని ముండకి కొడుకొకడా – రంకుమొగుడికాడ తొంగడానికి లేని సిగ్గు, చూస్తే ఏం వచ్చిందిలే. సూస్తే ఆడే ఎల్లిపోతాడు సిగ్గుపడి. ఊ! దీపం ఎలిగించు, ఈ సీకట్లో సయ్యాట నాకు బాగోదు, లేదంటే నా డబ్బు నాకు పడేయి. నీ బాబులాంటిది మరోత్తి దొరుకుతుంది." వాడెవడో గట్టిగా అరుస్తున్నాడు. మాట స్పష్టంగా లేదు. చిన్నిగాడికి అన్నీ అర్ధం కాకపోయినా కొన్ని అర్ధం అయ్యాయి. చిన్నిగాడి వళ్ళుడికింది. వాడి తల్లి మళ్ళీ గదిలోకి వచ్చేవరకు అలా కొయ్యముక్కలా మంచం మీద కూర్చున్నాడు నిద్రపోకుండా.

వాడి తల్లి లోపలికి వస్తూనే మంచంమీద కూర్చున్న చిన్నిగాడ్ని చూసి ఉలిక్కిపడింది. "ఏరా, ఎందుకు లేచావు" అంది కఠినంగా. చిన్నిగాడికి ఏవేవో అనాలి వున్నా అనలేక గుడ్లు మిటకరించి చూశాడు. ఆ

చూపు చూసేసరికి చిన్నిగాడి తల్లికి తిక్కరేగింది. విసురుగా వచ్చి దబ దబ రెండు బాది. "చచ్చినోడా, ఎందుకురా అలా మేకులా కూర్చున్నావు. రాత్రి అయినా నిశాచరుడిలా పడుకోవేం. ఈసారి రాత్రి లేచావంటే గుడ్లు పీకేస్తాను. గుడ్డి వెధవ్వి అయితే ఉక్రోషంగా బతికిపోతాను" అంటూ బాదింది. చిన్నిగాడు ఏడవకుండా కోపంగా చూశాడు.

• • •

తరువాత నెల రోజులకి చిన్నిగాడు గుడ్డివాడయ్యాడు, వాడి కళ్ళు వాడి అమ్మ పీకలేదు - దేముడే పీకేశాడు.

ఆ రోజు చిన్నిగాడు చింతచెట్టెక్కి కాయలు కోస్తూ కాలుజారి పడ్డాడు. ఆ పడడంతో కింద బండరాయిమీద పడి, వాడి తల చిట్లింది. చిట్లిన తలని డాక్టర్లు ఎలాగో బాగుచేశారు కాని, దెబ్బ తగలని వాడి కళ్ళకి మాత్రం చూపు తెప్పించలేకపోయారు. నెలరోజుల తరువాత చిన్నిగాడు గుడ్డివాడయి ఇంటికి వచ్చాడు - వాడమ్మ గుండెలు బాదుకుని ఏడిచింది. "నాయనా చిన్నిగా, నా చీకటి బతుక్కి నీవే వెలుకనుకున్నానురా, ఎప్పటికయినా ఈ చీకట్లోంచి వెలుగులోకి తెస్తావనుకున్నానురా, నీ బతుకే చీకటయిపోతుందనుకోలేదురా-" అంటూ గోలు గోలున ఏడుస్తుంది. ఆ మాటలు చిన్నిగాడికి బోధపడవు. తల్లి అంతలా ఏడవడానికి ఏముందో వాడికి అర్థం కాలేదు. వాడు మాత్రం చక్కగా యిప్పుడే బాగుందనుకున్నాడు. చక్కగా ఎప్పుడూ చీకటే! వాడమ్మ ఏం చేసేది చూడక్కరలేదు. బళ్ళోకి పోనక్కరలేదు. చదవక్కరలేదు. చక్కగా అమ్మ బువ్వ తినిపిస్తుంది. నీళ్ళు పోస్తుంది పడుకోబెడ్తోంది. ఇదివరకులా తిట్టదు. అమ్మ మంచిదయిపోయిందని వాడికి సంతోషంగా వుంది. చీకటంటే వాడికిప్పుడు భయంలేదు.